

ఎమ్మెల్యేగా గెలుపొంది ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, రిటర్నింగ్ అధికారి అంకిత్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న సీతక్క



ఎమ్మెల్యేగా గెలుపొందిభూపాలపల్లి ఆర్వో రమాదేవి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గండ్ర సత్యనారాయణ

# ములుగు, భూపాలపల్లిలో కాంగ్రెస్ విజయం

- **33,700 ఓట్లతో సీతక్క, 52,699 ఓట్లతో సత్యనారాయణ గెలుపు**
- **రెండో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థులు**

ములుగు (నమస్తే తెలంగాణ)/ములుగు టౌన్, డిసెంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ధనసరి అనసూయ (సీతక్క) బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిపై 33,700 ఓట్లతో విజయం సాధించారు. మొత్తం 1,85,830 ఓట్లు పోలవగా, 1,767 పోస్టల్ ఓట్లు ఉద్యోగులు వినియోగించుకున్నారు. సీతక్కకు 1,02,267 ఓట్లు రాగా బీఆర్ఎస్ అభ్యర్థికి 68,567 ఓట్లు వచ్చాయి. బీజేపీ నుంచి పోటీ చేసిన అజ్మీరా ప్రహ్లాద్‌కు 5,388 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం 14 టేబుళ్లపై 22 రౌండ్లలో ఓట్లను లెక్కించగా ప్రతి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. పోస్టల్ ఓట్లలో సైతం సీతక్క 1,358 ఓట్లను సాధించగా, బడే నాగజ్యోతికి కేవలం 240మాత్రమే వచ్చాయి. దీంతో సీతక్క నాగజ్యోతిపై 33,700 ఓట్లతో గెలుపొందారు.

### నోటాకు 1,931 ఓట్లు

పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయడం ఇష్టం లేదని నియోజకవర్గంలోని 303 పోలింగ్ కేంద్రాలకు చెందిన 1,931 మంది ఓటర్లు నోటాను ఎంచుకున్నారు. మొదటి మూడు స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నిలువగా బీఎస్పీకి 1,347, స్వతంత్ర అభ్యర్థులు మద్దెల వెంకటేశ్వర్లుకు 3,709, వజ్జ సమ్మక్కకు 1,538, నునావత్ చంద్రునాయక్‌కు 1704, బంగారి నరేశ్ 483, మల్యాల మనోహర్‌కు 353, కొప్పుల సమ్మయ్యకు 300, వజ్జ జ్యోతిబసుకు 190 ఓట్లు వచ్చాయి. కాగా, పోస్టల్ బ్యాలెట్‌లో 14ఓట్లు చెల్లకుండా పోయాయి. ములుగు కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో పోలీస్ బందోబస్తు నడుమ ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్ విజయం సాధించిన సీతక్కకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

### భూపాలపల్లిలో..

జయశంకర్ భూపాలపల్లి, (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన గండ్ర సత్యనారాయణరావు బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిపై 52,699 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గల సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా పర్యవేక్షణలో ఓట్లను లెక్కించారు. నియోజకవర్గంలోని 317 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,24,858 ఓట్లు పోల్ కాగా, గండ్ర సత్యనారాయణకు 1,23,116, గండ్ర వెంకటరమణారెడ్డికి 70,417 ఓట్లు వచ్చాయి. నోటాకు 830 రాగా, 96 రిజెక్ట్ అయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి 241, కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావుకు 850, బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డికి 121 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి.

### అభ్యర్థుల వారీగా ఓట్లు

బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డికి 14,731 ఓట్లు, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థి తాళ్లపల్లి రమేశ్‌గౌడ్‌కు 3,464, స్వతంత్ర అభ్యర్థి మంతెన సంపత్‌కు 2,901, బహుజన సమాజ్ అభ్యర్థి గజ్జి జితేందర్‌కు 2,010, ఆజాద్ పార్టీ అభ్యర్థి అల్లకొండ ప్రవంతికి 1,130, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి వంగర సాంబయ్యకు 1,012, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి అస్రఫ్ మహ్మద్‌కు 916, ధర్మ సమాజ్ అభ్యర్థి కొత్తూరి రవీందర్‌కు 661, భారత్ సమాజ్ డెవలప్ పార్టీ అభ్యర్థి చేపూరి ఒదెలుయాదవ్‌కు 179, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) అభ్యర్థి దేవరాజుకు 157, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్క్సిస్టు, లెనినిస్టు(లిబరేషన్) అభ్యర్థి మారెపల్లి మల్లయ్యకు 145, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండి యా అభ్యర్థి రత్న పోశమ్మకి 389, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ అభ్యర్థి రమేశ్ గుప్తకి 240, జన శంఖారావం అభ్యర్థి సదా అఖిల్‌రెడ్డి 314, స్వతంత్ర అభ్యర్థులు అల్లం మహేశ్‌కు 833, కొటం రవీందర్‌కు 328, పొన్నం బుచ్చయ్యకు 275, జీ రజినికి 491, వావిలాల లక్ష్మణ్‌కు 463, గొడుగు సాహిత్‌కు 280, సిరిపల్లి రాజయ్యకు 406 ఓట్లు వచ్చాయి.

## ప్రజా తీర్పు శిరోధార్యం



ములుగు రూరల్, డిసెంబర్ 3 : ములుగు నియోజకవర్గ ప్రజల తీర్పు శిరోధార్యం అని బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకం ఉంచి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగా రేయింబవళ్లు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పాదాభివందనాలు తెలియజేశారు. తనకు అండగా నిలిచిన కేసీఆర్, కేటీఆర్‌తో పాటు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, సాంబారి సమ్మారావు, మెట్టు శ్రీనివాస్‌తో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కకు నాగజ్యోతి శుభాకాంక్షలు తెలిపారు.



నంది విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## కాళేశ్వరంలో భక్తుల సందడి

కాళేశ్వరం : శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం మూడో ఆదివారం సందర్భంగా భక్తులు సందడి చేశారు. ఇతర రాష్ట్రాలు, వివిధ జిల్లాల నుంచి అనేక మంది తరలి వచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు త్రివేణి సంగమం గోదావరి తీరంలో స్నానాలాచరించారు. మహిళలు దీపాలు వదిలి, సైకత లింగాలకు పూజలు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని తులసి, మారేడు చెట్టు వద్ద భక్తులు లక్ష వత్తులు, కార్తీక దీపాలు వెలిగించారు. వివిధ పూజల ద్వారా రూ. 2.32 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### రామప్పలో..

వెంకటాపూర్ : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

### లక్నవరంలో..

గోవిందరావుపేట : మండలంలోని లక్నవరంలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాడే వంతెనలపై నుంచి బోటింగ్ పాయింట్‌కు చేరుకొని సరస్సులో షికారు చేశారు.

### మల్లూరు దేవస్థానంలో

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం ఆయా ప్రాంతాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారికి తిలతైలాభిషేక క్రతువు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి గుట్టకు వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. దైవ దర్శనానికి ముందు భక్తులు చింతామణి జలపాతాన్ని సందర్శించారు.



వెంకటాపూర్ : రామప్పలో పూజలు చేస్తున్న భక్తులు

## 15 ఏండ్ల నిరీక్షణ !

### ఎట్టకేలకు అసెంబ్లీకి గండ్ర సత్యనారాయణరావు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ) : గండ్ర సత్యనారాయణరావు 15ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు మొట్టమొదటి సారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిపై 52,699 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన సత్యనారాయణరావు 1983లో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తి చేసి అక్కడే రాడికల్‌లో పనిచేశారు. 1984లో అజ్మీరా చందూలాల్ సమక్షంలో టీడీపీలో చేరారు. 1987లో బుద్దారం సర్పంచ్‌గా గెలుపొందాడు. 1995లో గణపురం జడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందాడు. 2001లో ములుగు జడ్పీటీసీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో భూపాలపల్లి నియోజకవర్గం ఏర్పడగా టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించగా పొత్తులో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి సిరికొండ మధుసూదనాచారికి టికెట్ వచ్చింది. దీంతో ఆయన పోటీ నుంచి విరమించుకున్నారు. 2014లో బీజేపీ, టీడీపీ మద్దతులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2017లో టీడీపీని వీడి టీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో ఏఐఎఫ్‌బీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. చివరగా 2021 సెప్టెంబర్ 30న కాంగ్రెస్‌లో చేరి ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఎన్నో ఏండ్లుగా అసెంబ్లీలో అడుగుపెట్టాలనే ఆయన కోరిక ఈ ఎన్నికల్లో నెరవేరింది.

## తెల్లం గెలుపుపై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 3 : భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలవడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గూడవర్తి నర్సింహామూర్తి మాట్లాడుతూ తెల్లం వెంకట్రావు విజయానికి కృషి చేసిన ప్రజలు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూరి లక్ష్మీనారాయణ, చిడెం రవికుమార్, జక్కుల సమ్మయ్య, జాగర శివాజీ, శాంతమూర్తి యాదవ్, ముడుంబా శ్రీను, గ్యానం రవీందర్, చిట్టెం రవి, చలమయ్య, వినోద్ పాల్గొన్నారు.



తెల్లం గెలుపుపై సంతోషం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కాటారం, డిసెంబర్ 3 : పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు మేడిపల్లి అటవీ ప్రాంతంలోని ఉసిరి వనంలో కుటుంబ సమేతంగా నోముకున్న అనంతరం వన భోజనాలు చేశారు. ప్రతియేటా సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరుపుకొంటామని కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు కలికోట శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పూజారి నాగరాజు శర్మ, సంఘం గౌరవ అధ్యక్షుడు గంగిరెడ్డి లచ్చిరెడ్డి, దారం నగేశ్ కుమార్, చిట్టూరి శ్రీనివాస్, బీరెల్లి రమేశ్, బొమ్మ శ్రీనివాస్, శనిగరం మల్లారెడ్డి, ఇండ్ల మహేందర్ రెడ్డి, కట్ల రాజయ్య, తోడె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న కిరాణా వర్తక వ్యాపారులు

## బొల్లారంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

వాజేడు, డిసెంబర్ 3 : మండలంలోని మొరుమురు జీపీలోని బొల్లారంలో ఆదివారం సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి ఎస్సై చావ్లా వెంకటేశ్వరరావు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోకి అపరచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని, వారి సమాచారం తమకు ఇవ్వాలని సూచించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 3 : తెలంగాణ ఓపెన్ స్కూల్ (టాస్) ప్రవేశాల గడువును డిసెంబర్ 11 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్ రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి భూపాలపల్లి జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.